# త్యాగమయి

రచన ;
శ్రీ. డి. హెచ్. వి. శర్మ.

కాలేజీలు తెరిచారు.

నేను గుంటూరులో బి.యస్‌సి. లో జాయినయాను. హాస్టలులో చేరాను.

ఒకరోజున...

బయటవరండాలో కూర్చొని ఊబుసుపోక, యేదో నవల చదువుతున్నాను. నాకు సమీపంలో ఒకతను దీర్ఘంగా చదువులో నిమగ్నుడైయున్నాడు. ఏదో నవల చదువుకుంటున్నాడు కాబోలు నాలాగే ననుకున్నాను. కాని మధ్యమధ్య అతను 'డిక్షనరీ' చూస్తూ తన చదువేదో, తానేదో అన్నట్టుగావున్నాడు. కాలేజీలు తెరచి నెలరోజులు కాలేదు. అప్పుడే మొదలెట్టాడేమిటా ? అనుకొన్నాను.

'ఏమండీ...ఏమిటి చదువుతున్నారు?' అన్నాను.

'సింబలైనండి...' అని జవాబిచ్చి ఎప్పటిలాగే పుస్తకంలో తలదూర్చాడు.

'ఐతే మీరూ బి.యస్‌సి. నే చదువుతున్నారా?... అప్పుడే లెసన్స్ బిగిన్ చేశారేంటి?' అని అడిగాను.

'అవునండీ...లెసన్స్ ఇంకా బిగిన్ చేయలేదు. వాళ్లు బిగిన్ చేశారంటే ఒకటే స్పీడు. మనం యీలోపల కాస్త టచ్ చేసుంటే త్వరగా అర్ధమవుతవి కదండీ?'

అతనితో 'కంబైన్ స్టడీ' చేస్తే నా మొద్దుబుర్రకేదైనా మెఱుగువస్తుందని నా మెదడులో ఓ ఆలోచన మెరుపులా మెరిసింది.

'ఏమండీ...మీ కభ్యంతరం లేపోతే మనిద్దరం ఒకే రూములో వుండే యేర్పాటు చేసుకుందాం. నాకొక్కడికి యేం చదవాలో తెలియటంలేదండీ' అని తొందర పెట్టుకున్నాను.

'సరే చూద్దాంలెండి. ఇప్పుడే అంత తొందరేమొచ్చింది' అన్నాడతను. నేను వారంరోజులు విడిచిపెట్టకుండా యెంతో బలవంతం చేసినమీదటగాని వేణు, నేను ఒకేరూములో వుండే అవకాశం లభించలేదు.

తరువాత, తరువాత మేము అతి సన్నిహితులమయ్యాం. 'ఏమండీ' అని పిల్చుకోటం పోతేపోయింది. 'ఒరేయ్' దాకా వచ్చింది వ్యవహారం.

నేను నాకుగల రహస్యాలన్నీ వేణుకు చెప్పాను. వేణుకూడ నాతో మనసువిప్పి మాట్లాడేవాడు. మా శరీరాలు వేరేగాని మనసొక్కటేనని మాలో మేము ప్రమాణాలు చేసుకున్నాం. అలా మాస్నేహం మూడు పువ్వులూ ఆరుకాయలుగా తయారైంది.

ఒకనాడు...

వేణు వాళ్ళవూరు వెళ్ళాలని, రెండురోజులలో నే వస్తానని సాయంత్రం 6 గంటలవేళ వెళ్ళిపోయాడు. వేణు లేకపోటంతో నా మనసేమీ బాగలేదు. ఆరోజే 'టెన్ కమాండ్‌మెంట్స్' పిక్చరు విడుదలయింది. 'సరే దానికివెళ్తే కాస్త కాలం గడుస్తుందికదా' అని బయలుదేరాను సినీ థియేటరుకు. జనం బాగా రద్దీగావుంది. ఎలాగో టికెట్ సంపాదించి హాల్లో జొరబడి శరీరాన్ని కుర్చీలో ఆన్చాను. కాని నేనుచూసిన సంఘటన... నాకు ముందువరుసలోనే వేణు, మరియొక అమ్మాయితో ఏవో కబుర్లు చెబుతున్నాడు. మధ్యమధ్య నవ్వుకుంటూ పిక్చరు చూస్తున్నారు. తల తిరిగిపోయింది. 'వేణు నాకీ విషయం చూచాయగానైనా చెప్పలేదే', 'బుద్ధిమంతుడికిమల్లే చదువుకుంటూ కూర్చొనే వేణేనా యిలా ప్రవర్తిస్తున్నది?' అనుకొని మథనపడ్డాను నాలో నేనే. నాకిక అచట నిలువ బుద్ధిపుట్టలేదు. లేచి బయటకు వచ్చాను. సిగరెట్టుతీసి కసిగా పీల్చాను. 'మనిద్దరికీ భేదం లేదు. రహస్యాలులేవు. అనే వేణేనా యిలా ప్రవర్తిస్తున్నది?' ఎడతెగని ఆలోచనలతో రూముకు చేరాను. ఆలోచనలకు అంతేది?

నిద్ర కుపక్రమించాను. కలతనిద్ర...ఏదో కల...

* * *

'ఏరా వేణూ. ఇదేనా నీ ఆదర్శమైత్రి. మనిద్దరి మధ్యా రహస్యాలులేవని చెప్పావే. మనిద్దరి ఆత్మలు ఒకటేనన్నావే. ఏమిటి నీవు చేసింది? నలుగురిలో నగుబాటుఅయ్యే పనికదూ?' అన్నాను ఆవేశంతో.

'శంకరం...ఎందుకలా ఆవేశపడతావ్. నేనేమి తప్పుచేశానని? జీవితంలో ఎవరో ఒకర్ని భాగస్వామినిగా నిర్ణయించుకోక తప్పదుగా? అందుకని...'

'ఏమిటి వేణూ నీవు మాట్లాడేది? పెద్దలు నిర్ణయించి 'వివాహం' చేసేనేగదా ... ఆమె నీ భాగస్వామిని? ఇలాగైతే 'సంఘం' ఏమంటుంది. సంఘంలో వేలెత్తి చూపించుకొనే పరిస్థితి నీకెందుకు కల్గాలి?' అన్నాను అనునయంతో.

వేణు ఆవేశపూరితుడయ్యాడు.

'అహ్హాహ్హా...సంఘమట సంఘం. సంఘాన్ని అనుసరించుకొని నడుస్తేగాని యీ లోకంలో నిల్చుటకు నీడ లేదా? పాడుసంఘం. ఛీ...' మధ్యలోనే అడ్డుపడ్డాడు.

'వేణూ ఎందుకలా పిచ్చిగా అరుస్తావ్. సంఘాన్నెందుకు దూషిస్తావ్? సంఘం నిన్నేం చేసింది? కాస్త నీ సుఖాన్ని, నీ ఆనందాన్ని మానుకుని నే చెప్పినట్లు నడిస్తే నీవు గౌరవం పొందుతావు. కాబట్టి నా అడుగు జాడల్లో నడువమంటుంది సంఘం ... అంతేగా?' అన్నాను.

'శంకరం. సంఘం...సంఘం...అని యెందుకలా పిచ్చిగా అరుస్తావ్? స్త్రీకి అందరితోపాటు సమాన హక్కులివ్వాలి—ఇవ్వాలి అని ఉపన్యాసవేదిక లెక్కి ఉపన్యాసాలద్వారా గౌరవం పొందదలచే చీడపురుగులు నిర్మించినదేగా 'సంఘం'? వీళ్లు నిజంగా స్త్రీకి గౌరవం ఇస్తున్నారా? కనీసం స్త్రీకి, తాగే సిగరెట్టు విలువైనా యిస్తున్నారా? ఈ ఉపన్యాసవేత్తలంతా...వ్యభిచారం నిర్మూలించాలి...అరికట్టాలి...అని గొంతెత్తి అరచే పెద్దమనుషులు చేస్తున్నదానిని ఏమనాలి? కాలిపోయిన సిగరెట్టును పారేసి మరొక సిగరెట్టు పెదవుల మధ్య యిరికించుకునే విధంగా యెందరు అబలలను మోసంచేస్తున్నారు? ఎందరి జీవితాలను భగ్నంచేస్తున్నారు? ఇలాంటివాటికేగా నీవన్న 'సంఘం' లో గౌరవం. ఛీ...ఇక సంఘం పేరు నాదగ్గర రానీకు...'

ఉలిక్కిపడి లేచాను.

* * *

బారెడు ప్రొద్దెక్కింది.

వేణు నన్ను తట్టి లేపుతున్నాడు. కొంచెం దూరంలో రాత్రి మా వేణుతో కలసి నవ్వుతూన్న అమ్మాయి.

'ఏరా బ్రదర్ ఏంటి యింత ఎండెక్కేదాక పడుకున్నావ్?'

'....'

'మాట్లాడవేమిరా? ఊరికి వెళ్ళినవాణ్ణి అప్పుడే వచ్చాననా ఆశ్చర్యపడుతున్నావ్?' వేణు అడిగాడు.

'ఆ ఆఁ' అన్నాను యేమనాలో తోచక.

'శంకరం...ఊరికి వెళ్దామని బయలుదేరానా. మధ్యలో మా ఇందిర కనబడింది తన మిత్రబృందంతో. అన్నట్టు చెప్పటం మరచా. ఇందిరంటే నా చెల్లెలు... అదే మా చిన్నాన్న కూతురు.'

'అలాగా!' అన్నాను.

'చూడురా బ్రదర్, మా ఇందిర ఉత్తరం ముక్క కూడా వ్రాయకుండా ఇలా ఊడిపడ్తుందని నేను కలలో కూడా అనుకోలేదురా బ్రదర్' అన్నాడు వేణు.

'అధుగో మళ్ళీ అదే మాటేనట్రా అన్నాయ్. నేను ముందే చెప్పాగదా. అనుకోకుండా మా మిత్రబృందం ఈ ప్రోగ్రాం ఏర్పాటుచేసిందని...' అన్నది ఇందిర.

ఆమె మాట్లాడుతుంటే సెలయేటి గలగలలు గుర్తుకొచ్చాయి. ఆమె పలువరుస ముత్యాల్లా మెరుస్తూ ఆమె అందానికి మరింత హుందాతనాన్ని చేకూరుస్తున్నాయ్. ఆమె అందమైంది. కాని ఆ అందం చూసినవారిని ఉద్రిక్తపరచేదికాదు.

చూసినకొద్దీ ఆనందం కల్గించేదే ఆమె అందం.

నా కలత నిదురలోనే గన్న కల గుర్తుకొచ్చింది అలా కలగన్న నాకు చాల సిగ్గనిపించింది.

"అన్నట్టు మరచాను శంకరం. రాత్రి ఇక్కడకు వచ్చి నీకు నిద్రాభంగం కల్గించటం యెందుకులే అని. సెకండ్ షోకి వెళ్ళి హోటల్లో పడుకున్నాము. మరోలా భావించకు బ్రదర్" అన్నాడు నిజాయితీగల వేణు.

"ఛీ.. ఇతన్ని గురించేనా రాత్రి నేను అలాటి అభూతి కల్పనలు గావించింది. ఇలాటి మిత్రుణ్నేనా అనుమానించింది. ఛీ. ఛీ" మందలించాను మనస్సును రాత్రి మొరటుగా ఆలోచించినందుకు.

"అన్నాయ్.. మళ్లీ స్నేహితుల్ని కల్సుకొని వెళ్లాలి కదా.. టయిమవుతుంది ఇక పోదామా." ఇందిర మాట్లాడుతుంటే నాలో తెలియని ఆనందం పొంగింది. ఆమె వెళ్ళి పోతానంటే నా మనసేదో బాధతో మూల్గింది.

"ఫరవాలేదు కొద్దిసేపు కూర్చోండి, ఇప్పుడే వస్తా" నంటూ బాత్ రూమ్ కేసి నడిచాను.

అరగంటలో బాత్‌తో సహా పని ముగించుకొని రూములోకి వెళ్లాను.

"అన్నట్టు.. మీరేమి చదువుతున్నారు?" అన్నాను ఇందిరతో.

ఏదో సెకండరీగ్రేడు ట్రయినింగు చదువుతున్నాలెండి.. కాని మీరు మాత్రం నన్ను 'అండీ' అనకండేం"

"అవున్రా బ్రదర్ ఇందిరకు అలాంటివేమి నచ్చవురా బాగా అన్నాడు వేణు.

తరువాత కాసేపు ఆ కబుర్లలో పడ్డాం. తరువాత 'త్వరగా వెళ్లాలని టయిమవుతుందని లేచింది ఇందిర.

* * *

బి. యస్‌సి పరీక్షలు వ్రాశాము.

ఎవరి ఇళ్లకు వాళ్లు వెళ్లాము శెలవుల్లో పరీక్షా ఫలితాలు వచ్చాయి. వేణు ఫస్టుక్లాసులో పాసయ్యాడు. నేనూ పాసయ్యాను. థర్డ్ క్లాసులో నేను పైచదువులు చదివే స్తోమతలేక గుమాస్తాగిరీలో ప్రవేశించాను. వేణు యం. యస్సీలో జాయినయాడు వైజాగ్‌లో. వేణు నా చదువుకి పెట్టుబడి పెడ్తానన్నాడు. నేనే నిరాకరించాను. నా బలవంతంవల్లనే అతను ఎం. ఎస్సీలో జాయినయాడు. లేకపోతే నాలాగే యేదో గుమాస్తాగిరే గతయ్యేది.

* * *

ఒక సంవత్సరం సాఫీగానే గడచింది.

నాకు టి. బి సంప్రాప్తమయింది. వేణుకు జాబు వ్రాశాను నాకు ప్రమాద మేమీ లేదని. కాని తన చదువును వదలపెట్టి వచ్చాడు నాకు సేవ చేయటానికి. చెప్పాను. బ్రతిమాలాను. నీ చదువుకు భంగం కల్గించుకోవద్దని. కాని అతని చదువు విషయం అతనికి పట్టినట్లు లేదు. వేణు బలవంతం మీద నేను వైజాకిలో టి. బి వార్డులో చేరాను. డాక్టరు చెప్పాడు వ్యాధి నయమవటానికి మూడు నెలలైనా పట్టవచ్చునని వేణుకు. యూనివర్సిటీ పరీక్షలు ఇంకా రెండు నెలలే వున్నాయి.

కాని వేణు పరీక్షల విషయమై బాధపడలేదు. ఆ సంవత్సరం పరీక్షలకు వెళ్ళనని నిష్కర్షగా చెప్పాడు.

అతన్ని ఒప్పించటం నావల్ల కాలేదు.

నా వ్యాధి తగ్గుముఖం పట్టింది. కాని వేణు రోజురోజుకు నీరసించిపోతున్నాడు. విశ్రాంతిలేదు. విశ్రాంతి తీసుకోమని చెప్పినా 'నీ వ్యాధి నయమవుతే నాకంతే చాలు. నాకేమి ఫరవాలేదు' అంటుండేవాడు ఆ ప్రసక్తి వచ్చినప్పుడు.

నాకు టి. బి పూర్తిగా నయమైంది.

కాని . . భరించరానిది . .

వేణు ఒంట్లో రక్తంలేదు. అతన్ని చూస్తుంటే నాకు దుఃఖం ముంచుకొచ్చింది. ఒకనాడు వేణు నీరసించిన కారణాన స్పృహతప్పియాడు. వాళ్ల తలి దండ్రులకు టెలిగ్రామ్ యిచ్చాను. సాయంత్రమేవచ్చారు. అమ్మా నాన్నా. తన బిడ్డ పరిస్థితికి భోరున యేడ్చారు. వాళ్లను సమాధాన పెట్టటం నావల్ల కాలేదు.

'డాక్టరుగారూ మా వేణును మామూలు మనిషిని చెయ్యండి. నాకు ప్రాణదానం చేసిన మా వేణుకు న్యాయం చేకూర్చండి డాక్టరు గారూ' అని కాళ్లా పడ్డాను.

"ఆరోగ్యంగా వుండేవారు రక్తాన్ని యిస్తే వేణు బ్రతుకుతాడు. లేకపోతే నే చేయగల్గిందేమీ లేదు" న్నాడు డాక్టరు.

"నా రక్తాన్నిస్తాను డాక్టరుగారూ" అన్నాను.

కాని నా రక్తము పనికిరాదన్నాడు డాక్టర్.

"ఏమిచేయను. ఎలా నా వేణు ప్రాణం నిలబెట్టుకోగలను?"

పాపం! వేణు తలి దండ్రులా వృద్ధులు. నా రక్తమా పనికిరాదు. హా! దైవమా నేనేమి చేయను?.

భోరున యేడ్చాను.

కాని... ఊహించనిది జరిగింది.

ఇందిర...ఆనాడు నేను అనుమానించిన ఇందిర...

నాతో పరిచయమైన ఇందిర...

"అన్నయ్యా, అన్నయ్యా" అంటూ పరుగెత్తుకొని వచ్చింది.

డాక్టరు గారి వల్ల విషయం తెలిసికొంది.

'నా అన్నాయ్ బ్రతికితే చాలు...నారక్తాన్నిస్తాను' డాక్టరు గారూ...

ఆ పరిస్థితుల్లో నేనామెను ఎలా ఆపను?

నా మిత్రుని గతేం కాను?

రక్తాన్నెక్కించారు... వేణుకు

కగిలాడు అటూ ఇటూ... వేణు

"అన్నాయ్" అన్నది ఇందిర ప్రక్కకు తలత్రిప్పి.

మరిప్రక్కకు తిరగలేదు...ఇందిర...అంతే

వేణుకోసం... నా మిత్రునికోసం... తన అన్నాయ్ కోసం ...

తన నిండు జీవితాన్ని అర్పించింది . . . ఇందిర.

... ఏనాటిదో మరి యీ అనుబంధం ...

ఆమె నిండు జీవితాన్ని అర్పించిన. . . త్యాగమయి.